కె. బి. కృష్ణ

# ఆటవిడుపు

అది ఒక పల్లెటూరు. ప్రభుత్వ అప్పర్ ప్రైమరి స్కూలు. ఇంకా స్కూలుకు సమయం కాలేదు. పిల్లలు ఎవరికి తోచిన ఆట వాళ్ళు ఆడుకుంటున్నారు. చిన్న బజారులా ఉంది ఆ ప్రదేశమంతా.

స్కూలు వెనుకవైపు కాంపౌండులో మరొక ఆట జరుగుతూంది.

సురేష్ స్కూలులో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఆ వూరి మోతుబరి రైతు కొడుకు. గోపీ అనబడే గోపాలం ఆ రైతు దగ్గర పాలేరు కొడుకు. అతనూ ఆరవ తరగతి చదువుతున్నాడు.

సురేష్ గట్టుమీద దర్జాగా కాలుమీద కాలువేసుకుని కూర్చున్నాడు. కాళ్ళదగ్గర గోపీ కూర్చుని కాళ్ళు పడుతున్నాడు. సురేష్ సిగరెట్ కాలుస్తూ బూడిద దులపటానికి గోపి వైపు చూడగానే గోపి భయంతో అరచెయ్యి పడుతున్నాడు. అతని అరచేతిని యాష్‌ట్రేగా వాడు తున్నాడు సురేష్.

ఈ వింత చూస్తున్నారు కొంతమంది పిల్లలు.

“ సురేష్‌బాబుగారూ నేను క్లాసుకు వెళ్ళాలి. సాయంకాలం కాళ్ళు పడతాలెండి. ” దయనీయంగా అడిగేడు గోపి.

"రాస్కెల్ నీకు క్లాసులు పాఠాలు ఎందుకురా? మీ తాత మా దగ్గిర పనిచేశాడు. మీ నాన్న పనిచేస్తున్నాడు. నువ్వుకూడా మా ఇంట్లో పనిచెయ్యాలిరా. నువ్వు చదువుకుంటే ఎలాగు ? పేద్ద వీడు చదివి ఆఫీసరు అవుతాడు లాగుంది. ఒరేయ్, మీరు చదవకూడదురా. మీరు పుట్టింది పాలేరు బ్రతుకుకోసమేరా." అని వీపు మీద ఒక గుద్దుగుద్దేడు. గుడ్ల నీరు కుక్కుకుంటు గోపాలం కాళ్ళు పిసుకుతున్నాడు. ఈ వింత చూస్తున్న పిల్లలు ఏమీ మాట్లాడలేదు. ఎందుకంటే మాట్లాడితే సురేష్ వాళ్ళ పని పడతాడు. కొంచం సేపటికి ఈ ఆట ముగిసింది. క్లాసులు మొదలయితే సురేష్ వెళ్ళాడు. అ వెనుకనే చొక్కాతో కళ్ళు తుడుచు కుంటూ గోపాలం వెళ్ళాడు క్లాసులోకి. గత రెండుమూడు సంవత్సరాల నుండి ఈ ఆట జరుగుతున్నది.

సూర్య భగవానుడు పగలంతా తన ప్రతాపం చూపించి, అస్తమిస్తున్నాడు. ఆకాశమంతా చిత్రకారుడు ఎఱ్ఱటిరంగు పులిమినట్లుంది గోపాలం పుస్తకాలు పుచ్చుకుని ఇంటికి వెళ్తున్నాడు. అతని కళ్ళు ఎఱ్ఱగా వున్నాయి మనసులో తీరని ఆవేదన. నాన్న అయ్యగారిదగ్గిర పాలేరుపని, అమ్మ వాళ్ళ ఇంట్లో పాచిపని చేస్తే తను వారి అబ్బాయికి స్కూలులో కాళ్ళుపట్టాలా ? ఇలా అని ఏ పుస్తకాల్లో వ్రాసి ఉంది ? దేముడా నన్ను ఎందుకు ఇలా బాధిస్తావు ? అని మధన పడుతున్నాడు గోపాలం

తన పాకను చేరుకున్నాడు గోపాలం. నీళ్ళు పోసుకుని, లాంతరు వెలిగించుకుని చదువుకు ఉపక్రమించాడు. ఈ లోగా నాన్న రామయ్య

వచ్చాడు. ఎందుకనో ఈ రోజు తొందరగా వచ్చేడు. తన దగ్గరగా చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు.

" అయ్యా "

"ఏంటిరా ?"

" మరేం. అయ్యా మనం చదువుకో కూడదా ? "

" ఎవరన్నారు రా ? "

" సురేష్‌బాబుగారు "

" ఆయనా ?ఆయన పెద్దింటి బిడ్డరా. ఆయన ఏటన్నా చెల్లుతుందిరా. "

స్కూల్లో జరుగుతున్న ఆట సంగతి చెప్పేడు బాధతో గోపి.

" గోపాలం " అని బాధతో కౌగలించుకున్నాడు. కాని వాళ్ళను ఎదిరించే ధైర్యం తమకులేదు. తను వాళ్ళ దగ్గర అడుగులకు మడుగులొత్తే పాలేరు. తన భార్య వాళ్ళ ఇంట్లో పాచిపని చేస్తేకాని, తను వాళ్ళ పొలంలో పనిచేస్తేకాని తమకు గడవదు. తాము నిండా మునిగిఉన్నారు. అయ్యగారి దగ్గర తీసుకున్న అప్పు అది తీరదు. పైగా రోజు రోజుకీ వడ్డీతో రాక్షసిలా పెరుగుతూంది. ఈ పరిస్థితుల్లో సురేష్‌బాబుని ఈ పని చెయ్యవద్దని మందలిస్తే అమ్మో అనుకున్నాడు రామయ్య.

" తండ్రీ నేను రేపు ప్రొద్దునవచ్చి సురేష్‌బాబుకు చెప్తానులే. అంతగా ఆయనకు కావాలంటే నేనేవచ్చి కాళ్ళుపడతానులే " అన్నాడు రామయ్య.

మనసు శాంతించి పడుకున్నాడు ప్రశాంతంగా గోపాలం.

మరునాడు సురేష్ మామూలుగా తన ఆట కొనసాగిస్తున్నాడు, ఈలోగా రామయ్య వచ్చాడు.

" రామయ్యా ఏమిటి వచ్చావు "

" అయ్యా సురేష్‌బాబూ, మా గోపాలం వంట్లో బాగా లేదు. ఆణ్ణి వదిలేయండిబాబూ. మీకు నేను వచ్చి కాళ్ళు పడతాను "

" నువ్వెందుకులే రామయ్యా. నీకు ఇంటిదగ్గరపని సరిపోతుంది వీడు కాస్సేపు పట్టి చదువుకుంటాడులే." మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు రామయ్య.

ఏదో పరిష్కారం జరుగుతుందని కొండంత ఆశ పెట్టుకున్న గోపాలం ముఖం చిన్నబై పోయింది. రామయ్య వెళ్ళిన మరుక్షణంలో సురేష్ లేచి గోపాలం జట్టు పట్టుకొని కొట్టసాగేడు. ఇదంతా మిగతా పిల్లలు వింతగా చూస్తున్నారు.

" ఏరా మీ నాన్నకు చెప్పి మీనాన్నను తీసుకువస్తావా ? నాకు చెప్పిస్తావా ? ఎంత పొగరురా నీకు? ఒంట్లో బాగాలేదా ? దున్నపోతులా ఉన్నావు నీకు రోగమా ? నాకు కాళ్ళు పిసకటానికి నీకు నామోషి అయిందా ? రాస్కెల్. నీకు చదువు కావాలా " అంటూ గోపాలం చేతిలో పుస్తకాలు బలవంతంగా తీసుకుని కుప్పలా పోసి నిప్పంటించాడు. అవి వెంటనే అంటుకుని మంటలయ్యాయి.

కె. బి. కృష్ణ

గోపాలం గుండెల్లో మంటలు. అయ్యో తన పుస్తకాలు. అయ్యా తనకోసం పట్నంనుండి తెచ్చిన పుస్తకాలు. అయ్యో తన చదువు ఎలాగు? చదువు కోవాలి ? తన చదువుకోవాలన్న ఆశలు మండి మసి అయి పోతుంటే గుడ్ల నీరు కుక్కుకుని నిశ్చేష్టుడై చూస్తూ నిలబడి పోయేడు గోపాలం. ఈ దుష్టుడినుండి కాపాడే వాళ్ళు ఈ ప్రపంచంలో లేరు. ఎక్కడికైనా వెళ్ళి పోవాలి. ఎక్కడికి ? ఈ తేడాలు లేని చోటికి వెళ్ళిపోవాలి.

దూరంగా తనను చూపించి పగలబడి నవ్వుతున్నాడు సురేష్.

" బాబూ మీరు గొప్పోళ్ళు. మేము చదువుకోడానికి పనికిరాని, లేని బీదోళ్ళం బాబూ, మిమ్మల్ని ఎదిరించి బ్రతుకలేం బాబూ, అయ్యా మీ జన్మ గొప్పది. మా జన్మ చాకిరీలు చేసే జన్మ. అవును మేం చదువుకోకూడదు. తరతరాలుగా మేము మీకు చాకిరీ చెయ్యాలి. మా తాత, మా నాన్న. నేను తరువాత నా కొడుకు" ఛీ అని నేలమీద ఉమ్మివేసి, " నేను ఈ ఆనవాయితీని అంతం చేస్తాను. మా నాన్న తరువాత ఎవరూ ఈ పని చెయ్యకూడదు " అనుకుంటూ స్కూలునుండి బయటకు వచ్చాడు గోపాలం.వెడుతున్నాడు, ఊరి చివరదాటి ఎక్కడికో. తన మనసు ప్రశాంతంగాఉంది. తన తండ్రి తరువాత ఎవరూ ఇక వెట్టిచాకిరీ చెయ్య వలసిన పని లేదు. తను ఏమయినా ఫర్వాలేదు. ఇది అంతం అయితేచాలు. గోపాలం వెళుతున్నాడు,

(జనసుధ మాసపత్రిక ఫిబ్రవరి 1981)